క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 1145 మంది హాజరు

చీరాల అర్బన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షను ఆదివారం పట్టణంలో నిర్వహించారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కింద పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభ కనబరచిన విద్యార్థులకు 8వ తరగతిలో చదువు మానేసి వారిని సెకండరీ దశలోనే చదివేలా ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం. ఉపకార వేతనం ఏడాదికి రూ.12 వేలు అందించనున్నారు. బాపట్ల జిల్లాలో చీరాల, బాపట్ల, రేపల్లెలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. చీరాలలో భాష్యం స్కూల్, చైతన్య స్కూల్, ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్, కేజీఎం హైస్కూల్, ఏఆర్‌ఎం హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈకేంద్రాల్లో 1168 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1145 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓ-1 సుబ్రహ్మణ్యేశ్వరరావు పరిశీలించారు.

ఓటర్ల నమోదు ప్రక్రియ పరిశీలన


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహశీల్దారు రవికుమార్

యద్దనపూడి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని తహశీల్దారు రవికుమార్ అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తహశీల్దారు మండలంలోని పూనూరు, గన్నవరం, యనమదల, యద్దనపూడి, అనంతవరం, జాగర్లమూడి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటీ విష్ణు, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, వీఆర్వోలు ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం


డ్రా తీస్తున్న డిపో మేనేజర్ మోహనరావు

అద్దంకి: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని డిపో మేనేజర్ మోహనరావు అన్నారు. స్థానిక డిపోలో ఆదివారం ఆయన అద్దంకి–ఇంకొల్లు రూటులో ప్రోత్సాహం కోసం ఏర్పాటు చేసిన గిప్ట్ స్కీంలో భాగంగా లాటరీ తీశారు. ఈ లాటరీల్లో ఎం ప్రదీప్‌కుమార్ బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీని ఎక్కువ మంది ప్రయాణికులు ఆదరిస్తున్నారన్నారు. మరింత మందికి ప్రయాణాన్ని చేరువ చేసేందుకు వివిధ రకాల పథకాలను ప్రవేశపెట్టామన్నారు. గతం నుంచి ఈ గిప్ట్ స్కీం ప్రవేశపెట్టామని, ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన దినోత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చీరాల అర్బన్: పట్టణంలోని సంతబజారులో వేంచేసియున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి 99వ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఆదివారం దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు గుంటూరు మాధవరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షణలో ఉదయం దేవాలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ధ్యానమండలి చీరాల శాఖ వారిచే నామసంకీర్తన, భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న కారు


ప్రమాదానికి గురైన కారు

జే.పంగులూరు: వేగంగా వెళుతూ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని రేణింగవరం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. అందిన వివరాల మేరకు.. ఒంగోలుకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో కోటప్పకొండకు వెళ్లి తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారిలో వస్తున్నారు. కారు రేణింగవరం దాటి అవలవపాడు స్టేజికి వచ్చేసరికి అద్దంకి నుంచి ఇంకొల్లు వెళ్తున్న పార్సిల్ వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బ తినగా, కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురికి గాయాలులయ్యాయి. వెంటనే వారిని ఒంగోలు ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

మిచాంగ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం

- తీరప్రాంత గ్రామాలను సందర్శించిన ఆర్డీవో సరోజిని
- అప్రమత్తమైన అధికారులు

చీరాల టౌన్: మిచాంగ్ తుఫాను తీరం దాటేంతరకు వాడరేవు, తదితర సముద్రతీర ప్రాంత మత్స్యకారులను సురక్షిత ప్రాంతాలకు తరలించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని చీరాల ఆర్డీవో పి.సరోజిని తెలిపారు. మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో భారీవర్షాలు, ఈదురుగాలులు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం ఆర్డీవో సరోజిని, తహశీల్దార్ ప్రభాకరరావు, మెరైన్ ఎస్సై సుబ్బారావు, రూరల్ ఎస్సై జనార్దన్, రెవెన్యూ సిబ్బంది వాడరేవు, రామాపురం, విజయలక్ష్మీపురం, కఠారిపాలెం తీరప్రాంత గ్రామాల్లో పర్యటించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లకూడదన్నారు. కలెక్టర్ ఆదేశాలు, సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో క్షిపణి ప్రయోగాల నేపథ్యంలో ఈనెల 23 వరకు సముద్రంలో వేటను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని ఆదేశించారు. వాడరేవులో సముద్రం అలల ఉధృతి అధికంగా ఉండటంతో తీర ప్రాంతానికి పర్యాటకులను అనుమతించకుండా రెవెన్యూ, మెరైన్, సివిల్ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. మత్స్యకారులు తమ వలలు, బోట్లు, వేట సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాన్ ప్రభావం తగ్గేంత వరకు అధికారులు అందరు అన్నీ ఏర్పాట్లు తీసుకుంటున్నామని తీరప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. తుఫాన్ తీవ్రత తగ్గేంత వరకు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సూచించారు. తీర ప్రాంతానికి పర్యాటకులు ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్, మెరైన్ ఎస్సై, సుబ్బారావు, ఆర్‌ఐ శేఖర్, ఎఫ్‌డీవో రాజ్‌కుమార్, పంచాయితీ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, సచివాలయాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.


వాడరేవు తీరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సరోజిని, తహశీల్దార్ ప్రభాకరరావు


పల్లెపాలెంలో సముద్ర తీరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి, అధికారులు


వాడరేవు జెట్టీ వద్ద సురక్షితంగా నిలుపుదల చేసిన బోట్లు, వలలు


వాడరేవులో ఉధృతంగా ఉన్న సముద్రం

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు

వేటపాలెం: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుఫానుగా మారిందంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్ల వద్దని ఎంపీడీవో కే నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి వర్షాలు ప్రారంభం అవుతాయని, బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. తుఫాన్ హెచ్చరికల కేంద్రం ప్రకటించి నందున గ్రామస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాన్ ప్రభావం ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉంటుందని అంచనావేశామన్నారు. వీరి వెంట ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, కార్యదర్శి పూర్ణకుమారి, సిబ్బంది ఉన్నారు.

చినగంజాం: తీరప్రాంతంలో నివశిస్తున్న మత్స్యకార గ్రామాల ప్రజలు తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పీ పార్వతి, ఎంపీడీఓ కే స్వరూపరాణిలు హెచ్చరించారు. మండలంలోని తీరప్రాంత గ్రామాలైన చినగంజాం మండలం పల్లెపాలెం పంచాయతీలోని బాపయ్యనగర్, మోటుపల్లి పంచాయతీలోని రుద్రమాంబపురం గ్రామాలను అధికారులు సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో వారి వెంట పంచాయతీ కార్యదర్శులు ఏ మస్తాన్, నాగేంద్రం, వీఆర్వోలు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

వనభోజనాలతో కిక్కిరిసిన వనాలు


భోజనాలు ఆరగిస్తున్న ప్రజలు


చింతపల్లిపాడులో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు


ఉసిరి చెట్టు కింద పూజలు నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

వేటపాలెం: వివిధ ప్రాంతాల్లో గల దేవస్థానాల వద్ద గల వనాల్లో భక్తులతో ఆదివారం కిక్కిరిశాయి. కార్తీక మాసం ఆదివారం సెలవు కావడంతో ఉద్యోగులు, చిన్నారులు చుట్టు పక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు దేవస్థానం వద్దకు చేరుకొని పూజలు చేసి వనసమారాధనల్లో పాల్గొన్నారు. కొత్తపాలెం రోడ్డులోగల దత్తసిద్ధి క్షేత్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముందుగా దత్తాత్రేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉసిరి చెట్టు కింద పూజలు నిర్వహించారు. అనంతరం వనసమారాధన చేశారు. రామన్నపేట శివారులోగల కనక నాగవరపమ్మ దేవస్థానం వద్ద భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యాలు చెల్లించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకొన్నారు. ఉసిరి చెట్టుకి పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబాల సమేతంగా వనాల్లో చెట్ల కింద వనభోజనాలు చేశారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద బ్రాహ్మణ కార్తీక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు గొల్లపూడి సీతారాం, కరణం మురళీ, నున్నా శివప్రసాద్, కారంచేటి చంద్రశేఖర్, ప్రత్తి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

చింతపల్లిపాడులో ఘనంగా వన సమారాధన..

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్యులు కార్తీకవన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తులసీదామోదరస్వామి పూజాకార్యక్రమాన్ని అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు శాస్త్రోకంగా నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరిచెట్టుకు పూజలు నిర్వహించిన అనంతరం వనభోజనాలు చేశారు.

చదవడంతో మరింత విజ్ఞానం


మాట్లాడుతున్న లైబ్రేరియన్ విజయభాస్కరరెడ్డి


ప్రదర్శనకు ఉంచిన పుస్తకాలను ఎంపిక చేసుకుంటున్న విద్యార్థులు, ప్రజలు


బల్లికురవ గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి): పుస్తకాలు చదవడంతో విజ్ఞానం కలుగుతుందని లైబ్రేరియన్ బాదం విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థుల చేత పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ తరగతి పుస్తకాలతోపాటు, ఇతర పుస్తకాలను విద్యార్థులు చదవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా ఇతర విషయాలు బోధపడతాయని చెప్పారు. వీలున్నప్పుడల్లా పుస్తకాలు చదవాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని అందించడమే ధ్యేయం..

వేటపాలెం: ప్రతి ఒక్కరికీ విజ్ఞానాన్ని అందించడమే ధ్యేయమని గ్రంథాలయ పాలకవర్గం కమిటీ సభ్యుడు కాకరపర్తి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సారస్వత నికేతనం గ్రంథాలయంలో ఉచిత పుస్తకాలు పంపిణీ ఆదివారం ముగిసింది. ఈకార్యక్రమం రెండు రోజు దాదాపు 8 వేల పుస్తకాలను పంపిణీ చేశామని చెప్పారు. రెండు రోజుల్లో దాదాపు 12 వేల పుస్తకాలను ప్రజలకు అందించామన్నారు. ప్రదర్శనకు ఉంచిన పుస్తకాలను తీసుకెళ్లడానికి విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారన్నారు. గ్రంథాలయంలో ఉచిత పుస్తకాలు తీసుకున్న వారందరి వాటిని సద్వినియోగించుకోవాలని సూచించారు.

బల్లికురవ: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని ప్రతి విద్యార్థి రోజులో ఓ గంట లైబ్రరీకి వచ్చి పుస్తకాలు చదవాలని లైబ్రేరియన్ ఏ రమేష్ బాబు కోరారు.

దేవాలయానికి మైకులు అందజేత


మైక్ సెట్ అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ స్వయంభూ క్షేత్రం మాణికేశ్వరంలోని మల్లీశ్వరస్వామి దేవస్థానానికి కావేరీ ట్రావెల్స్ అధినేత వేమూరి సుబ్బారావు కుమారుడు వినోద్ ఆదివారం మైకులను అందజేశారు. వాటిలో అవుజా యాంప్లిఫయర్, 8 మైకులు, 4 మౌత్‌లు కమిటీకి అందజేశారు. వీటి విలువ రూ.80 వేలు ఉంటుందని తెలిపారు. మైకులను దాతల తరుపున ఈదా శ్రీనివాసరెడ్డి దేవస్థాన ఈవో గాదె శివశంకరరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సోమా శ్రీనివాసరెడ్డి స్థానికులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛన్ పంపిణీ


ఆసుపత్రిలో పెన్షన్ అందుకుంటున్న విల్సన్

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ఇడుపులపాడు సచివాలయ పరిధిలో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్న వ్యక్తికి వలంటీర్ నూతలపాటి రాజేష్ ఆదివారం పెన్షన్ అందజేశాడు. విజయవాడలోని ఆంధ్ర హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుంటున్న నూతలపాటి విల్సన్‌కు హాస్పిటల్‌కు వెళ్లి రాజేష్ పెన్షన్ అందజేశాడు. సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి వలంటీర్లను పెట్టి తనలాంటి వ్యక్తులకు పెన్షన్ అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని విల్సన్ అన్నారు.

ఆడుదాం ఆంధ్రా కోసం రిజిస్ట్రేషన్ల నమోదు


పోటీలకు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్న సిబ్బంది

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి అవసరమైన క్రీడాకారులను ఎంపిక చేయడంతో పాటు, వారు పోటీలకు సద్ధమయ్యేలా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ షేక్ ఖాశీం అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రం కారంచేడు–3 గ్రామ సచివాలయ పరిధిలోని యువతకు సూచనలు చేశారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులతో పాటు, క్రీడలను వీక్షించడానికి కూడా 8 నుంచి 14 ఏళ్ల వారిని కూడా రిజిస్టర్ చేస్తున్నామన్నారు. శారీరక, మానసిక ఉల్లాసానికి ఈ క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ పోటీలకు సన్నద్ధమవ్వాలన్నారు. ఆయన వెంట సచివాలయ కార్యదర్శి రాజమోహన్, స్థానికులు ఉన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు


తాగునీటి చెరువును శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కారంచేడు: మండల కేంద్రం, మేజర్ పంచాయతీగా ఉన్న కారంచేడు ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ ఈవో కే అంజయ్య అన్నారు. గత కొన్ని రోజుల క్రితం గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేసే జయప్రకాష్ నారాయణ చెరువులో ఉన్న కొద్దిపాటి చేపలు నీటి కలుషితం వలన చనిపోయాయి. నీరు మరింత కలుషితం అవ్వడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెరువులోని చేపలు పట్టించి, నీటిని బయటకు పంపించి ఎండబెట్టామన్నారు. ఆదివారం చెరువులో రాళ్లు, సున్నం కూడా చల్లించి మరింత శుభ్రం చేయించామన్నారు. సుమారు 22 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తాగునీటి చెరువుకు కొమ్మమూరు కాలువ నుంచి నీరు నింపనున్నామన్నారు. గ్రామస్తులకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోవు రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఈచర్యలు చేపట్టామన్నారు.

సాగర తీరాన రోటరీ క్రీడా మహోత్సవం

చీరాల అర్బన్: రామాపురం బీచ్‌లో పెరల్ రిసార్ట్స్‌లో ఆదివారం రోటరీ జిల్లా స్థాయి సాగరతీర క్రీడా మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి ప్రారంభించారు. ఉదయం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన కార్యక్రమం రాత్రి వరకు ఆట, పాటలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సాగింది. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు, లక్కీ డిప్‌లో గెలుపొందిన వారికి కూడా బహుమతులు అందించారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, జివై ప్రసాద్, డివి సురేష్, డాక్టర్ ఐ.బాబూరావు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్ రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శివాలయంలో ఘనంగా లక్ష రుద్రాక్ష పూజలు


స్వామివారికి రుద్రాక్షలతో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


రుద్రాక్షలతో స్వామివారికి అలంకరణ

చీరాల అర్బన్: పట్టణంలోని నల్లగాంధీబొమ్మ సెంటర్ వద్ద గల చీరాల శివాలయంలో ఆదివారం లక్ష రుద్రాక్ష పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భక్తులు స్వయంగా వారి హస్తాలతో స్వామివారికి రుద్రాక్షలను సమర్పించుకునే అవకాశాన్ని కల్పించారు. భక్తులు తెచ్చిన రుద్రాక్షలను స్వామివారిని చేరేలా ఏర్పాట్లు చేశారు. ముందుగా పట్టణంలో రుద్రాక్షలను ఊరేగించారు. అనంతరం స్వామివారికి సమర్పించారు. స్వామివారిని భక్తులు తెచ్చిన రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సంప్రదాయాలకు ప్రతీక కార్తీక మాసం



కార్తీక మాస విశిష్టతను వివరిస్తున్న అసోసియేట్ కోదండరామ్

చీరాల రూరల్: సంప్రదాయాలకు, అనుబంధాలకు, ఐకమత్యాలకు ప్రతీకగా కార్తీన వన భోజనాలు నిలుస్తున్నాయని అందుకు కార్తీక మాసం ఎంతో అనువుగా ఉంటుందని అసోసియేట్ ప్రొఫెసర్ నోరి కోదండరామ్ అన్నారు. ఆధ్యాత్మిక పీఠం చీరాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక స్వర్ణ రోడ్డులోని రైల్వేగేటు వద్దగల లయన్స్ క్లబ్ ట్రస్టు బిల్డింగ్ నందు కార్తీక మహాత్మ్యం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోదండరామ్ పాల్గొని భక్తులకు కార్తీక మాస విశిష్టతను గురించి వివరించారు. కార్తీక మాసంలో పుణ్యస్నానాలు చేయడం వలన మన శరీరం ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పీఠం వీ వెంకటరావు, సెక్రటరి ఎంఎస్. ప్రసాదరావు, పబ్బిశెట్టి రామారావు, కొమ్మూరి ఆంజనేయులు, అమరా వెంకట రాఘవరావు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కుతో ప్రశ్నించే హక్కు


కొప్పరపాడులో సూచనలు ఇస్తున్న తహశీల్దార్


అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో సరోజిని


ఇంకొల్లులో పోలింగ్ స్టేషన్‌లను పరిశీలిస్తున్న తహశీల్దార్ బ్రహ్మయ్య

బల్లికురవ: ఓటు హక్కుతో ప్రశ్నించే హక్కు ఏర్పడుతుందని తహశీల్దార్ కే రవిబాబు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని 56 పోలింగ్ బూత్‌ల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. చేర్పులకు 85, తొలగింపులకు 42, సవరణలకు 49 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ చెప్పారు. కొప్పరపాడు గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక క్యాంపును తహసీల్దార్ పరిశీలించి పలు సూచనలు చేశారు. వీరి వెంట వీఆర్‌వో శ్రీనివాసరావు ఉన్నారు.

చీరాల టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామని చీరాల ఆర్డీవో, ఎన్నికల అధికారి పి.సరోజిని తెలిపారు. ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చీరాల మండలంలో అదనపు ఎన్నికల అధికారి, చీరాల తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఆధ్వర్యంలో పోలింగ్ బూతులను ఆర్డీవో సరోజిని పరిశీలించారు. మండలంలోని బుర్లవారిపాలెం, ఈపురుపాలెం, వాడరేవు, తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆర్డీవో పరిశీలించారు. ఆర్డీవో వెంట డిప్యూటీ తహశీల్దార్లు సురేష్, ఆదినారాయణ, ఆర్‌ఐలు అర్జున్, శేఖర్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు ఉన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 2,3 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేని పురస్కరించుకొని ఆదివారం తహసీల్దార్ పీ బ్రహ్మయ్య ఇంకొల్లు పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలింగ్ స్టేషన్ 231, 232, 239, 241, 249, 250లను సందర్శించారు. రెండు రోజుల్లో మొత్తం 82 క్లైయిమ్స్ వచ్చినట్లు ఆయన వివరించారు.

మోటుపల్లి, కదవకుదురులో..

చినగంజాం: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్‌ని పురస్కరించుకొని తహశీల్దార్ పీ పార్వతి ఆదివారం మండలంలోని కడవకుదురు, మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ బూత్‌లను సందర్శించి పరిశీలించారు. కడవకుదురు పంచాయతీ పరిధిలోని పోలింగ్ బూత్‌లు 266, 267, 268 మోటుపల్లి పంచాయతీ పరిధిలోని 269, 270 బీఎల్‌ఓలకు తగు సూచనలు ఇచ్చారు.

దివ్యాంగులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి


మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్ నాజ్

మార్టూరు: ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల దివ్యాంగుల సంక్షేమం సంఘం అధ్యక్షుడు ఖాలేషావలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల దివ్యాంగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా పాల్గొన్న స్థానిక నాయకులు దివ్యాంగుల సంక్షేమం గురించి మాట్లాడారు. కార్యక్రమంలో పఠాన్ కాలేషావలి, గడ్డం మస్తాన్‌వలి, జెడ్పీటీసీ కరిముల్లా, పఠాన్ ఖాదర్‌వలి, కరిముల్లా, రెహమాన్, సులేమాన్, రాణి,తదితరులు పాల్గొన్నారు.

చీరాల రూరల్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా న్యాయమూర్తి నిషాద్ నాజ్ పాల్గొని మాట్లాడారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, న్యాయవాదులు శ్రీకాంత్ ఠాకూర్, స్నేహ, పీఎల్‌వీ ఎస్‌డీ మతిన్, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

5,6 తేదీల్లో పాఠశాలలకు సెలవులు

కారంచేడు: తుఫాను తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశాల మేరకు, బాపట్ల డీఈవో ఉత్తర్వులతో ఈనెల 5,6 తేదీల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సెలవులు ప్రకటించారు. సోమ, మంగళవారాలు పాఠశాలలు తెరవకూడదన్నారు. తుఫాన్ కారణంగా విద్యార్థుకు ఎలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు ఉన్నతాధికారులు ఈ ఉత్తర్వులు ఇచ్చారని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ తెలిపారు.